క్లుప్తంగా

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

మన్సూరాబాద్: ఎల్‌బీ నగర్‌లోని స్రింట్ డయాగ్నోస్టిక్స్‌లో ఈనెల 7న (ఆదివారం) ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కీళ్ల వైద్య నిపుణులు, స్త్రీ వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, గుండె వైద్య నిపుణులచే ఉచితంగా కన్సల్టేషన్ అందిస్తామన్నారు. ఈసీజీ, బ్లడ్‌షుగర్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతున్నారు. మరిన్ని వివరాలకు 040-69066767 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సబితకు శుభాకాంక్షలు



ఎల్‌బీనగర్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు ముద్దబౌలి సతీష్‌కుమార్ గౌడ్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం



పాల్గొన్న హరిగౌడ్

సైదాబాద్: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ గెలుపొందటం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సైదాబాద్‌లో వాల్ పెయింటింగ్ అభియాన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, యశ్వంత్, జైశ్వాల్, చంద్రకాంత్‌గౌడ్, ఫణిగౌడ్, చంద్రకుమార్, లోకేష్ పాల్గొన్నారు.

'అంజన్'కు సత్కారం



అంజన్‌కుమార్‌కు పూలబొకే అందజేస్తున్న చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ పార్లమెంట్ సభ్యుడు అంజన్‌కుమార్ యాదవ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నాయకులు మహేష్, యాదిలాల్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, శ్రీకాంత్, ధనుంజయ్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



ఆటల పోటీల్లో పాల్గొన్న ఎల్లయ్య తదితరులు

హస్తినాపురం: కంపెనీల్లోని కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, వేతన సాధన కోసం తాము చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రతి కార్మికుడు కదిలిరావాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో మేడే వారోత్సవాల్లో భాగంగా కార్మికులకు ఎల్‌బీనగర్ సీఐటీయూ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యదర్శి ఆర్.పాండు, పి.శ్రీనివాస్, బి.దుర్గారావు, ఎం.యాదయ్య, కె.భాను పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ వైఖరి ప్రకటించాలి

నాగోలు: హైదరాబాద్‌కు ఈనెల 7న విచ్చేస్తున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తిన సుధాకర్ మాదిగ కోరారు. శుక్రవారం ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన డిమాండ్ చేశారు. గత 29 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం జరుగుతున్న విషయాన్ని యావత్ భారత సమాజానికి తెలిసిన విషయమేనని సుధాకర్ మాదిగ అన్నారు. వర్గీకరణ అంశంపై బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు తమ పార్టీ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు రాజు శేఖర్, బుజ్జన్న , ప్రమోద్ ప్రకాష్, మౌలాలి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్వాకం..
చెరువు మరింత కలుషితం!

- సరూర్‌నగర్ చెరువులోకి మురుగునీరు వదులుతున్న వైనం
- దుర్వాసనతో స్థానిక కాలనీవాసుల ఇక్కట్లు
- పట్టించుకోని ఎస్‌ఎన్‌డీపీ అధికారులు



కాలుష్య కాసారంగా మారిన సరూర్‌నగర్ చెరువు

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువు సుందరీకరణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఒకవైపు ప్రజాప్రతినిధులు ప్రకటిస్తుండగా..., మరోవైపు ఎస్ఎన్‌డీపీ అధికారుల అలసత్వం కారణంగా చెరువు మరింత కాలుష్య కాసారంగా మారుతోంది. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరా చేసుకొని బహిరంగంగానే కలుషిత నీటిని మోటార్లతో తోడి చెరువులోకి వదిలేస్తున్నాడు. అసలే అంతంత మాత్రంగా ఉండే సరూర్‌నగర్ చెరువు ఎస్ఎన్‌డీపీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్వాకం కారణంగా మరింత కాలుష్యంగా మారుతోంది.

- ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి శంకేశ్వరబజార్ చౌరస్తా వద్ద నాలాకు అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.
- నిర్మాణ పనుల కోసం గుంతలు తీసే క్రమంలో పలుచోట్ల డ్రైనేజీ పైప్‌లైన్లు పగిలి మురుగు నీరు బయటకు వస్తోంది.
- ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొన్నిచోట్ల బాక్స్ డ్రెయిన్‌లోకి కలుషిత నీరు చేరుకుంది. చెరువును ఆనుకొని ఉన్న రహదారిపైనే ఈ పనులు సాగుతున్నాయి.
- చెరువు సమీపంలో ఉండటాన్ని ఆసరాగా చేసుకున్న కాంట్రాక్టర్ ట్రాక్టర్‌కు రెండు మోటార్లు బిగించి కలుషిత నీటిని చెరువుకు ఏర్పాటు చేసిన తూము ద్వారా నేరుగా సరూర్‌నగర్ చెరువులోకి వదిలేస్తున్నాడు.
- బాక్స్ డ్రెయిన్‌లోకి చేరుకున్న కలుషిత నీటిని ఇతర పద్ధతుల్లో తొలగించాల్సింది పోయి ఇలా నేరుగా చెరువులోకి వదలటం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
- చెరువులోకి మురుగునీరు భారీగా వచ్చి చేరడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమల బెడద కూడా ఎక్కువైందని సమీప కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా ఎస్ఎన్‌డీపీ అధికారులు ఈ వ్యవహారాన్ని అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.



మోటార్ల ద్వారా చెరువు తూము నుంచి వదులుతున్న కలుషిత నీరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఇప్పటికే సరూర్‌నగర్ చెరువు కాలుష్యం కారణంగా పరిసర కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణ గుంతల్లో పేరుకున్న కలుషిత నీటిని చెరువులో కలపకుండా ఇతర మార్గాల ద్వారా తొలగించాలి. కానీ నేరుగా చెరువులోకి వదలడం వల్ల చెరువు మరింత కాలుష్యం అవుతుంది. ఇది సరైన పద్ధతి కాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ కార్పొరేటర్

దుర్వాసన, దోమలతో ఇబ్బందులు



కలుషిత నీటిని చెరువులోకి వదలడం వల్ల దుర్వాసన అధికమయ్యింది. చెరువులో కాలుష్యం కారణంగా చుట్టుపక్కల ఉన్న కాలనీల్లో దోమల బెడద విపరీతంగా పెరిగింది. ఎండాకాలంలో ఉక్కపోతతో పాటు దోమల బెడద పెరగటంతో ఇళ్లలోని చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరూర్‌నగర్ చెరువులోకి కలుషిత జలాలు కలువకుండా చర్యలు తీసుకోవాలి.

– షేక్ మహమూద్, ఐఎస్‌సదన్ సీపీఐ కార్యదర్శి

చౌరస్తాను మహనీయుల విగ్రహాలతో తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: తెలంగాణ ముఖద్వారమైన ఎల్‌బీనగర్ చౌరస్తాలో మహనీయుల విగ్రహాలను పునఃప్రతిష్ఠించి అందంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన దళిత సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ చౌరస్తాలో అండర్‌పాస్, ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్న సమయంలో అక్కడ ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను కామినేని ఆసుపత్రి రహదారిపై తాత్కాలికంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం చౌరస్తాలోని అండర్ పాస్, ఫ్లైఓవర్ పనులు పూర్తి కావడంతో ఆ మహనీయుల విగ్రహాలతో పాటు జ్యోతిరావ్ పూలే, శ్రీకాంత చారి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను పునః ప్రతిష్ఠించి చౌరస్తాను అందంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు చిరంజీవి, ఆడాల రమేష్, గుంటి లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రధాన రహదారులతో పాటుగా అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రతాప్‌నగర్‌లో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ శుక్రవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడైన రోడ్లు సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్లు, ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయిస్తామన్నారు. సౌకర్యాలు మరింతగా మెరుగు పర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు నందు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏ ముజీబ్, నాయకులు సురేష్, సంతోష్, దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో విద్యార్థి, నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: విద్యార్థి, నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ పాలనలో ఒరిగిందేమి లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. సలీంనగర్‌లోని నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సర్కార్ టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. సిట్ విచారణపై నమ్మకం లేదని, సీబీఐతో పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు తగిన గుణ పాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి అన్యూహ స్పందన వస్తోందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 8న తలపెట్టిన 'నిరుద్యోగ నిరసన సభ'కు ప్రియాంకగాంధీ హాజరు కానున్నారని, ఈ సభకు మలక్‌పేట నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సమావేశంలో బ్లాక్ ప్రెసిడెంట్ మదన్‌బాబు, నాయకులు కావేటి శ్రీకాంత్, ధనుంజయ, యాదిలాల్, ఎండీ షకీల్, మహేష్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, శివ, శ్రీనివాస్‌రెడ్డి, ఖాజా, స్వామి, భరత్, నారప్ప పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తాం



కాలనీ సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ శ్రీ శివగంగ కాలనీలో 'ఇంటెన్సివ్ శానిటేషన్ – కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్' సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్థానికులను కాలనీలో నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ, శానిటైజేషన్, దోమలు, నీటి సరఫరా వంటి సమస్యలను కార్పొరేటర్ పవన్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మాత్య నాయక్, కాలనీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సుక్ జీవన్ రెడ్డి, గోవర్ధన్, వాటర్ వర్క్స్ అధికారులు సత్యనారాయణ, దయాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన..

కొత్తపేట డివిజన్ కమర్షియల్ టాక్స్ కాలనీలో చేపట్టిన సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని, కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు తొందరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, రాజేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ జంగ్ సైరన్' సభను విజయవంతం చేయాలి

చంపాపేట: సరూర్‌నగర్ ఓపెన్ స్టేడియంలో ఈనెల 8న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ సభకు అధిక సంఖ్యలో నిరుద్యోగులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి కోరారు. చంపాపేటలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన నిరుద్యోగ జంగ్ సైరన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉచిత వేసవి శిబిరం ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

చంచల్‌గూడ: చంచల్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరాన్ని శుక్రవారం డిప్యూటీ డీఈఓ నెహ్రూబాబు ప్రారంభించారు. వివిధ కళలు, ఆటల్లో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. తమ పాఠశాల విద్యార్థులకే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల పిల్లలు కూడా ఈ శిబిరంలో పాల్గొనవచ్చని ఆయన అన్నారు.

ఆలయాభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలి



ఎమ్మెల్యేను కలిసిన ధర్మకర్తల మండలి సభ్యులు

లింగోజిగూడ: దిల్‌సుఖ్‌నగర్ శ్రీకనకదుర్గ ఆలయాభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలని, భక్తులకు కావల్సిన సౌకర్యాలు కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన కనక దుర్గ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తాను కూడా తగిన చేయూత నందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాంచందర్, ఈఓ సత్యనారాయణ, డైరెక్టర్లు జయశ్రీ,, వెంకటేష్, అప్పారావు, శ్రీనివాస్‌రెడ్డి, తులసికృష్ణగౌడ్, కృష్ణ, సంతోష్ యాదవ్, కిషన్, అజయ్, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శివప్రకాష్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి సహకారం



మన్సూరాబాద్: డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలోని లలితా నాగలింగేశ్వరస్వామి ఆలయానికి కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ రూ. లక్ష విలువ గల కుర్చీలను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆలయాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపోలు విశ్వనాథం, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, విజయలక్ష్మి, సభ్యులు రామకృష్ణ, గజం గోవర్ధన్, క్రిష్ణారెడ్డి, మధుబాల, శైలజ, రమా తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహం అద్భుత శరణాలయం



మొక్కలు నాటుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థులను చేరదీసి, కార్పొరేట్ స్థాయి వసతులు, విద్యా సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్న గృహ కమిటీని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అభినందించారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రా లే అవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగ నాయకుడు లోకేష్ అధ్వర్యంలో శ్రీనివాస గుప్తా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గృహం విద్యార్థులకు అన్నాదానం చేశారు. కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్, ఎల్‌బీఆర్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగ నాయకులు, అనాథ గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దేప భాస్కర్ రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించే నిరుద్యోగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ విప్, బాల్కొండ మాజీ శాసనసభ్యుడు ఈరవర్తి అనిల్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జ్యోత్స్నా రెడ్డి, చరణ్ యాదవ్, మహేశ్వరం నియోజక వర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని ఓ హోటల్‌లో మహేశ్వరం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలు, పేపర్ లీక్‌లకు నిరసనగా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ పాల్గొంటున్నారని, అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రామకృష్ణాపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, సరూర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చిక్కుల్ల శివ ప్రసాద్, యువ జన నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్ రెడ్డి, కందుకూరు మండల అధ్యక్షుడు కృష్ణా నాయక్, మహేశ్వరం మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న కాంగ్రెస్'



రంగారెడ్డి ఇంటి ముందు బీజేపీ నాయకులతో కలిసి బైఠాయించిన సురేందర్‌రెడ్డి

సైదాబాద్: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడం సిగ్గుచేటని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి విమర్శించారు. కర్ణాటక ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని పొందుపరచడాన్ని నిరసిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సైదాబాద్ డివిజన్ తిరుమలహిల్స్‌లోని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటి ముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన బైఠాయించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సామూహికంగా హనుమాన్ చాలీసా పఠించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కర్ణాటక సహా ఇతర రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు హిందువులు తగిన గుణపాఠం చెపుతారన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ దేశంలోని హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, వీరేంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.

నాగోలు యానిమల్ కేర్ సెంటర్‌లో కుక్కల మృత్యువాత?

- సోషల్ మీడియాలో ఫొటోల హల్‌చల్
- అధికారులపై చర్యలకు జంతు ప్రేమికుల డిమాండ్

నాగోలు: నాగోలు ఫతుల్లాగూడలోని జీహెచ్‌ఎంసీ యానిమల్ కేర్ సెంటర్‌లో వీధి కుక్కల మృత్యువాత పడుతున్నాయని జంతువు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. యానిమల్ కేర్ సెంటర్‌కు వీధి కుక్కలను తీసుకొచ్చి వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి మళ్లీ వదిలేస్తుంటారు. అయితే, గత వారం రోజులుగా ఈ యానిమల్ సెంటర్‌లో ప్రతి రోజూ 30 వరకు కుక్కలు చనిపోతున్నాయని, కుక్కలకు రోజుల తరబడి ఆహారం పెట్టకపోవడంతో మృత్యువాత పడుతున్నాయని జంతుప్రేమికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా కుక్కలను నాగోలు వెటర్నరీ కేంద్రంలో దహనం చేస్తున్నారని అంటున్నారు. అంతేకాకుండా, వెటర్నరీ వైద్యులకు బదులు ఔట్ సోర్సింగ్ కార్మికులతో కుక్కలకు సర్జరీలు చేసినట్టు వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. యానిమల్ కేర్ సెంటర్‌లో మృతి చెందిన కుక్కల ఫొటోలు తీసి శుక్రవారం సోషల్ మీడియాలో పెట్టారు. ఈ ఘటనపై విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

తప్పుడు ప్రచారం చేస్తున్నారు...

ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ యానిమల్ కేర్ సెంటర్ అధికారి జేవ్యా నాయక్ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ కుక్కల రెస్క్యూసెంటర్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నడుస్తోందన్నారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి రోజూ 100 వరకు వీధి కుక్కలను సర్జరీల కోసం యానిమల్ కేర్ సెంటర్‌కు తీసుకొస్తారన్నారు. వీటిలో అనారోగ్యంతో ఉన్న మూడు, నాలుగు కుక్కలు చనిపోతున్నాయని తెలిపారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన డాక్టర్లు మాత్రమే కుక్కలకు కుటుంబ నియంత్రణ సర్జరీలు చేస్తారని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన కుక్కలను ప్రతి రోజు వేరే ప్రాంతాలకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తరలిస్తారని, అయితే, గతంలో ఇక్కడ పని చేసి మానేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చనిపోయిన కుక్కల ఫొటోలను బయటకు పంపి తప్పుడు ప్రచారం చేస్తున్నారని జేవ్యా నాయక్ అన్నారు.